క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లిలోని రాష్ట్ర ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాల/ కళాశాల (టీఎస్‌ఆర్‌ఎస్, జేసీ)లో ఆదివారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. గురుకులం ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ మొక్కల పెంపకం వద్ద పచ్చదనం వృద్ధి చెందుతుందన్నారు. ఇందుకుగాను ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఆ తర్వాత పాత బెల్లంపల్లి పంచాయతీలో గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అటవీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా క్రాంతి


నియామకపత్రాలు అందిస్తున్న నాయకులు

కాసిపేట: ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా దుర్గం క్రాంతి, కో కన్వీనర్‌గా కాంపెల్లి వెంకటేశ్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు వారికి నియమాకపత్రాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మండల సమావేశంలో ఎమ్మార్పీఎస్ భవిష్యత్ కార్యచరణపై చర్చించి వారిని ఎన్నుకున్నట్లు మండల ఇన్‌చార్జి జిలకర శంకర్ తెలిపారు. అనంతరం ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చొప్పదండి కిషన్, సీనియర్ నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దాసరి శంకర్, లంక లక్ష్మణ్, గసికంటి మల్లేశ్, దాసరి రాజయ్య, గొడిసెల బాపు, గొడిసెల బాలయ్య, బుగ్గ రాజు, సురేందర్, అజయ్, కుమార్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే అనాధ, వృద్ధాశ్రమంలో ఆదివారం చర్మవ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు లక్ష్మీ నారాయణ, రాజగోపాల్ పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. పిల్లలు, వృద్ధులకు చర్మవ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మెన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి మహేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు సదానందం, తిరుమల పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయం ప్రారంభం


పూజలు చేస్తున్న భక్తులు

భీమారం: మండల కేంద్రంలోని ఇప్పల బొగుడ వద్ద నిర్మించిన మైసమ్మ ఆలయాన్ని ఆదివారం పూజార్లు ప్రారంభించారు. గ్రామస్తులు అందరూ బాగుండాలని పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

చెట్లతీర్థాలు..వాడ పోచమ్మలు


గుడిపేటలో సామూహిక వంటల్లో మహిళలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆషాఢ మాసం అంతా సందడిగా కనిపిస్తోంది. ఊరూరా వాడ పోచమ్మలు చేసుకోవడం, వాడల్లో అంతా కలిసి చెట్లతీర్థాలకు వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్నారు. ఆదివారం వాడపోచమ్మ పూజలు చేసి మేకలు బలిచ్చి పోగులు వేసుకున్నారు. గ్రామాల్లో అందరూ కలిసి చెట్లతీర్థాలకు వెళ్లి చెట్ల కింద వంటావార్పు చేసుకుని సామూహిక భోజనాలు ఆరగించారు.


జిల్లా కేంద్రంలో ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు


హైటెక్‌సిటీ కాలనీలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు

ఖాళీ జాగా.. రోగాలు పాగా..!

- జిల్లా కేంద్రంలో 150కి పైగా ఖాళీ ప్లాట్లు
- పెరుగుతున్న పిచ్చి మొక్కలు
- నిలుస్తున్న వర్షపు నీరు
- దుర్వాసన, దోమలతో స్థానికుల ఇబ్బందులు
- ఇళ్ల మధ్య ప్లాట్లలోనే వేస్తున్న చెత్త

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ఇళ్ల మధ్య ఖాళీ ప్లాట్లు వ్యాధులు ప్రబలేందుకు కారణంగా మారుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఖాళీప్లాట్లలో నీరు నిలవడంతో పాటు, పిచ్చి మొక్కలు పెద్ద ఎత్తున పెరుగుతుండడంతో దోమల వ్యాప్తి పెరుగుతోంది. పందులకు స్థావరాలుగా నిలుస్తుండగా, సీజనల్ వ్యాధులకు కారణమవుతున్నాయి. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లలో, పక్కనే ఉన్న ఇళ్లకు చెందిన వారు చెత్తను పారేయడంతో చెత్త పేరుకుపోయి, దుర్వాసన వెదజల్లుతోంది. ఖాళీ స్థలాల యజమానులు పట్టింపులేకుండా వ్యవహరిస్తుండడంతో, ఏటా వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాలనీల్లో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ఇళ్లల్లో నుంచి వచ్చే మురికి నీరు ఖాళీ ప్లాట్లలోకి చేరి అక్కడే నిలుస్తుంది.

వర్షాకాలం మరింత ఇబ్బందిగా..

మంచిర్యాల పట్టణంలోని శివారు కాలనీలైన వికాస్‌నగర్, లక్ష్మీనగర్, పాతమంచిర్యాల, మధురాగనర్, రంగంపేట్, శ్రీనివాస కాలనీ, పవర్‌సిటీ కాలనీ, గోపాల్‌వాడ, రాజీవ్‌నగర్, తిలక్‌నగర్, చున్నంబట్టివాడ, సాయికుంట, గ్రీన్‌సిటీ కాలనీ, శ్రీశ్రీనగర్, హైటెక్‌సిటీ కాలనీల్లో ప్లాట్లను కొనుగోలు చేసిన వారు, ఇంటిని నిర్మించకుండా ఖాళీగా ప్లాట్లను వదిలేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లను యజమానులు పట్టించుకోకుండా వదిలేయడం వల్ల మురుగు నీరు, వర్షపు నీరు చేరి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా మరుగుదొడ్డి



మందమర్రిరూరల్:పట్టణంలోని మార్కెట్ బస్టాండ్ ఆవరణలో పబ్లిక్ మరుగుదొడ్డి అసంపూర్తిగా ఉంది. 18 నెలలైనా పూర్తి కాకపోవంతో ప్రజలు అసహనం వ్యక్తం చే స్తున్నారు. గత ఎన్నికల్లో చెన్నూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత వివేక్ వెంకటస్వామి.. గత జనవరి 24న ప్రజల సౌకర్యం కోసం మరుగుదొడ్డి నిర్మాణానికి భూమి పూజ చేసి మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకు రావాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ విషయమై పలుమార్లు సాక్షిలో కథనాలు వెలువడ్డాయి. అయినప్పటికి పనులు పూర్తి కాక ఎక్కడి గొంగడి అక్కడే అన్నచందంగా ఉంది. పట్టణంలో ఆదివారం పర్యటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి అభివృద్ధి పనుల్లో జాప్యం చేస్తే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. మరుగుదొడ్డి నిర్మాణం పూర్తిచేయని కాంట్రాక్టర్‌పై ఏమైనా చర్యలు తీసుకుంటారా? లేక త్వరగా పనులు చేయించి మరుగుదొడ్డిని ప్రారంభిస్తారా వేచి చూడాల్సిందే.

ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మ దహనం


దహనం చేస్తున్న తీన్మార్‌మల్లన్న టీం సభ్యులు

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లోని క్యూ న్యూస్ కార్యాలయంతోపాటు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఎమ్మెల్సీ కవిత అనుచరులు తెలంగాణ జాగృతి కండువాలు కప్పుకుని దాడి చేయడాన్ని తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు మహేశ్ వర్మ ఖండించారు. తీన్మార్ మల్లన్నపై దాడిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మను దహనం చేశారు. తీన్మార్ మల్లన్నపై దాడికి ప్రేరేపించి హత్యాయత్నానికి ఉపిగొల్పిన కవితపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్న టీం జిల్లా ఉపాధ్యక్షుడు పాకాల దినకర్, కార్యదర్శి రాజశేఖర్, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మనోహర్, బీసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉప్పరి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ


తాండూర్: బోనాలతో వస్తున్న మహిళలు

బెల్లంపల్లి: ఆషాఢమాసం పురస్కరించుకుని జిల్లాలో బోనాల పండుగను ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి కన్నాల శివారు బంగారు మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకుని నియోజకవర్గ ప్రజలను సల్లంగా చూడాలని బంగారు మైసమ్మను ప్రార్థించారు. అంతకుముందు బోనం ఎత్తుకుని వచ్చి మైసమ్మకు సమర్పించారు. అంతకుముంద భక్తులు బోనంతో శోభాయాత్ర చేశారు. కాంగ్రెస్ కమిటీ నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతిగృహంలో బోనంకుండలను పసుపు, కుంకుమలతో అలంకరించి ఎన్టీఆర్ నగర్‌లోని పోచమ్మ ఆలయం వరకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. వసతిగృహ సంక్షేమాధికారి చందన, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని కిష్టంపేట, తాండూర్ బస్టాండ్ ఏరియాలో బోనాలతో డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలు ఆకట్టుకన్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించకుని నైవేద్యాలు సమర్పించారు.


బోనం ఎత్తుకుని వస్తున్న ఎమ్మెల్యే వినోద్


బోనంతో పోచమ్మ ఆలయానికి వెళ్తున్న వసతి గృహ సంక్షేమాధికారి చందన, విద్యార్థినులు


హెలీప్యాడ్ నుంచి వస్తున్న మంత్రులు


గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి


తరగతి గదిలో బెంచీపై కూర్చున్న మంత్రులు

మంచిర్యాలలో డిప్యూటీ సీఎం, మంత్రులు

మంచిర్యాల జిల్లాలో ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రులు దామోదర్ రాజనర్సింహా, శ్రీధర్‌బాబు పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకుముందు కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, డీసీసీ జిల్లా అధ్యక్షురాలు సురేఖ వారికి పుష్పగుచ్ఛాలు అందించారు.


డిప్యూటీ సీఎంకు గొంగడి, మేకపిల్ల బహుకరిస్తూ..


జంగల్ సఫారీ జ్ఞాపికలు అందజేస్తూ..

మౌలిక సదుపాయాలు కల్పించాలి

- రాష్ట్రమంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రిరూరల్: పట్టణంలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర మైనింగ్, కార్మిక ఉపాధి కల్పనశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధి బురదగూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని రోజులుగా తాగునీటికి ఇబ్బందవుతుందని ఆయన దృష్టికి తెచ్చారు. సమస్య పరిష్కరించాలని అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ రాజలింగును ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రెయినేజీలు శుభ్రం చేయించి, మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనులు సమయానికి పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడానికైన వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్‌ఐ గణపతి, అధికారులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, నాయకులు సొత్కు సుదర్శన్ తదితరులు ఉన్నారు.


మార్నింగ్ వాక్‌లో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి వివేక్

కనువిందు చేసిన ఇంద్రధనుస్సు



వేమనపల్లి: వరద తగ్గి వయ్యారంగా ప్రవహిస్తున్న ప్రాణహిత తల్లి సిగలో ఇంద్రధనస్సు (సింగిడి) విరిసింది. పగలంతా ఎండకాసి పొద్దుగూకే సమయంలో చిరుజల్లులు మొదలయ్యాయి. పడమటి సంధ్యాకిరణాలు వాన చినుకులపై పడి తూర్పున మహారాష్ట్ర వైపు సింగిడి కనువిందు చేసింది. మరోవైపు ప్రాణహిత ప్రవాహంలో ప్రతిబింబించింది. ఈ దృశ్యాన్ని పలువురు తమ కెమెరాల్లో బంధించారు.


ఆస్నాదలో మరో కాలనీకి వెళ్లే దారిలో బురద


బ్యాంకు పక్క కాలనీకి వెళ్లే దారిలో నిలిచిన నీరు

బురదమయంగా రోడ్లు

చెన్నూర్‌రూరల్: ఆస్నాద గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆయా కాలనీలకు వెళ్లే రోడ్లపై మురుగునీరు, వర్షపు నీరు నిలిచింది. మరికొన్ని కాలనీలకు వెళ్లేదారిలో బురదమయంగా మారింది. రాకపోకలు సాగించే పాదాచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గౌడ కాలనీలో మూడు నెలల క్రితం బోరు మోటారు కాలి పోవడంతో తొలగించి పైపులను పక్కన పడేశారు. ఇప్పటికి మోటారు ఏర్పాటు చేయలేదు. దీంతో కాలనీప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు.

ఎరువుల పంపిణీపై విచారణ


చెన్నూర్ సహకార సొసైటీలో విచారణ చేస్తున్న ఏడీ ప్రసాద్

చెన్నూర్: చెన్నూర్ సహకార సొసైటీ ద్వారా ఎరువుల పంపిణీ సక్రమంగా జరగడం లేదని, ఇతర మండలాలతోపాటు పక్క జిల్లాలకు చెందిన రైతులకు ఇస్తున్నారని చెన్నూర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సుద్దపల్లి సుశీల్‌కుమార్ జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. దీంతో అగ్రికల్చర్ ఏడీ బానోత్ ప్రసాద్ ఆదివారం విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. కోటపల్లి మండల రైతులకు ఎరువులు ఇచ్చినట్లు గర్తించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన రైతుకు ఎరువులు ఇచ్చినట్లు గుర్తించినా.. ఆ రైతు చెన్నూర్ మండలంలో భూములను కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నట్లు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ సొసైటీ చైర్మన్‌కు ఎరువులు పంపిణీ చేసే బాధ్యలు లేవని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీకెళ్తామని తెలిపారు. సోమవారం నుంచి ఏ మండలానికి చెందిన రైతులు ఆ మండలంలోనే ఎరువులు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తామన్నారు. చెన్నూర్, కోటపల్లి మండలాల్లో ఇక నుంచి వ్యవసాయ శాఖ అధ్వర్యంలోనే ఎరువుల పంపిణీ జరుగుతుందన్నారు. చెన్నూర్ సొసైటీకి 2,928 బస్తాల యూరియా రాగా, ఇప్పటి వరకు 2484 ఎరువుల బస్తాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

పీఆర్సీ అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శాంతికుమారి

మంచిర్యాలఅర్బన్: రాష్ట ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఆర్సీ అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ 2023, జూలై 1నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని రెండేళ్లు గడిచినా నివేదిక ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని కోరారు. పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని సూచించారు. జీవో 317తో నష్టపోయిన ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని, ఉపాధ్యాయులకు మెరుగైన హెల్త్ స్కీం తీసుకురావాలని కోరారు. కేజీబీవీ, ఆశ్రమ పాఠశాల సీఆర్టీలకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ప్రత్యేక వార్డెన్లను, కేర్ టేకర్లను నియమించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్ సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెకాలపు వేతనం చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి రాజావేణు, జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కోశాధికారి కిరణ్, కార్యదర్శులు చంద్రమౌళి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గుట్ట నిండా జనం

దండేపల్లి/జన్నారం: జిల్లా కేంద్రం కాదు..మున్సిపాలిటీ కాదు ఆఖరుకు మేజర్ పంచాయతీ కాదు. మారుమూల గ్రామంలో రెబ్బనపల్లి గుట్టపై ఆదివారం నిర్వహించిన బహిరంగసభకు లక్ష మంది పైగా ప్రజలు తరలిరావడం చూస్తుంటే ఆశ్చర్యమేస్తుందని, దీన్ని బట్టి చూస్తే ప్రజలగుండెల్లో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు స్థానం పదిలం చేసుకున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రేమ్‌సాగర్‌రావు నిండు నూరేళ్లు జీవించాలని, వెనుకబడిన ప్రాంతమైన మంచిర్యాల జిల్లా అభివృద్ధికి వారి సేవలు అవసరమని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు ఆయన ప్రాతినిధ్యం అవసరమని, త్వరలో అన్ని జరుగుతాయన్నారు. గ్రామానికి 600 బస్సుల్లో, వివిధ వాహనాల ద్వారా లక్షకు పైగా ప్రజలు తరలిరావడం పట్ల డిప్యూటీ సీఎంతోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

చందారంలో విగ్రహ ప్రతిష్ఠాపన

లక్సెట్టిపేట: మండలంలోని చందారంలో పోచమ్మ తల్లి పోతరాజు సహిత బొడ్రాయి శిలా విగ్రహయంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

మందమర్రిరూరల్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని ఎస్సై రాజశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైన ఫోన్ చేసి డిజిటల్ అరెస్ట్ అనగానే భయపడ్డొని, అలాంటి ఫోన్లు వస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మొబైల్ యూజర్స్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లవద్దని పేర్కొన్నారు. సోషల్ మీడియాలోని వాట్సప్ గ్రూప్‌ల ద్వారా వచ్చే లింక్‌లను ఓపెన్ చేయొద్దని సూచించారు.

రాజ్యసభ సభ్యుడికి సన్మానం


అనిల్‌కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: రాజ్యసభ సభ్యుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ ఇన్‌చార్జి అనిల్‌కుమార్ యాదవ్‌ను జిల్లా కేంద్రంలో గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము ఆశోక్‌యాదవ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. మంచిర్యాలకు వచ్చిన సందర్భంగా నాయకులు ఆయన్ను సత్కరించారు. కాంగ్రెస్ జిల్లా నాయకురాలు హేమలత, గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు మారం రఘు, తదితరులు ఉన్నారు.